శ్రీ ఏ. వి. బి. రామారావు

# వీలు

"అమ్మాయిగోరూ ! అమ్మాయిగోరూ!... అబ్బాయిగోరూ!... అంతా అయిపోయింది నాయనోయ్... అంతా అయిపోయిందమ్మోయ్!" లచ్చిమి గట్టిగా అరుస్తోంది.

రెండు నిముషాలలో గదులొకటీ ఒకటీ తెరుచుకున్నాయి. కొడుకులూ, కోడళ్లూ- పెద్దాడబడుచూ ముసలాయన గదిలోకి బిలబిలా వచ్చారు.

కొద్దిసేపట్లో ఇరుగుపొరుగువారూ రావడం ప్రారంభించారు. మురళీధర్‌రావ్‌గారు పోయారన్న వార్త ఊరంతా గుప్పుమంది.

"రేత్తిరి రెండయినాదేటో 'నచ్చి‌పీ నువ్వెళ్లిపోయే' అనేసి నారమ్మా ఇయ్యాలిలాసూస్తాననుకోనేదు"- సొంత తాతయ్య ప్రాణం తనవడిలోపోవడమే...లచ్చిమికి గుర్తువస్తోంది. తను క్రిందటిరాత్రి ఆ ముసలి ప్రాణందగ్గర లేకపోయానే అని ఆమె మనసు విలవిల్లాడుతోంది. ఆమె గోడు ఎవరూ పట్టించుకోవడంలేదు. అంతాహడావుడి.

"మంచంమీదే ప్రాణంపోయింది... రామ,రామ!" అంటున్నారెవరో. శవాన్ని క్రిందకు దింపుతుంటే తలగడక్రింద నున్న గుండీ పుస్తకం చిన్నకొడుకు లాఘవంగా తప్పించేశాడు.

పెద్దకోడలికి కంటపడకూడనిదేదో కంటపడిందని ఆడబడుచుకు ఎలాగో తెలిసిపోయింది.

"ఇంకా రావలసినవాళ్ళు ఎవరయినా ఉన్నారాబాబూ?" అంటూ పురోహితుడు పెద్దకొడుకునడిగి అతని కళ్లవంకచూసి దూరంగా తప్పుకున్నాడు.

దహనకాండ పూర్తిఅయ్యేవరకూ ఆ ఇంటిలో నెలకొనిఉన్న ప్రశాంతత తుఫానుముందరి ప్రశాంతతే.

-గదిలో మంచంబదులు జ్యోతి చోటుచేసుకున్నాక పెద్దకోడలు మరిదిని మెల్లగా కదిపింది.

"రాఘవా, తల్లిలాంటిదాన్ని. నాదగ్గర రహస్యమెందుకు ? నువ్ పొద్దున్న నాన్నగారి తలగడ క్రిందనుంచి ఏదోతీసి దాచడం చూశాను. ఏమిటది ?"

రాఘవరావ్ మారుమాటాడలేదు. వదినగారు అతన్ని వదలలేదు.

"చూడు రాఘవా, ఈ ఆస్తికి మనమందరమూ వారసులమే- ఆయన గారికయితే పాపం డబ్బు పిచ్చనుకో... కాని మనమంతా ఇంతోఅంతో సంపాదించుకుంటున్న వాళ్ళమే. డబ్బుమోహం తెలియనివాళ్ళం కాదు- నువ్వంటే నాకు ప్రత్యేకమైన అభిమానం... నిన్నుచూస్తే చచ్చిపోయిన మూతమ్మణ్ణి చూసినట్టుంటుంది."

"వదినా, నేబయటకు వెళుతున్నా... మీరు ఏవేవోగుర్తుతెచ్చుకుని బాధపడకండి... మీ చెల్లెలికి ఒంట్లో నలతగా ఉందని మేడదిగలేదు. ఇంటినిండా మనుషులు... చచ్చిపోయినవాళ్ళతో మనమూచచ్చిపోలేం. వంటమనిషికి దగ్గరఉండి రాత్రికి తిండి ఏమిచెయ్యాలో చేయించండి!"

రెండో అబ్బాయి కారుతాళాలు జేబులోనుంచి తీస్తూ బయటకు నడిచాడు.

పెద్దకోడలు వెంటనే లాయరు రంగనాధంగారికి ఫోన్‌చేసింది.

"మురళీధర్‌రావ్‌గారు వీలునామా రాశారు... నన్ను సాక్షిసంతకం చెయ్యమన్నారు. నేనుచేశాను... ఆస్తి ఎవరికిరాశారో నేను చెప్పలేను. వీలు గుండీ పుస్తకంలో ఉంచడం నేనుచూశాను..." లాయర్ ఫోన్ పెట్టేశాడు.

రాత్రి పదయ్యాక ఆ లాయరును తీసుకువచ్చి మరిదిని నిలదీసి అడిగింది పెద్దకోడలు.

"మీరే చదివి వినిపించండి" అంటూ వీలునామా ఆయన చేతికిచ్చి మేడమీదకు వెళ్ళిపోయాడు రాఘవరావ్.

వకీలుగారు తీరికగా చదవడం మొదలెట్టారు.

నీటిలో మునిగి ప్రాణం పోయేక్షణంలో మనిషి జ్ఞాపకాలన్నీ ఒక తృటి కాలంలో మనసులో గిర్రున తిరుగుతాయంటారు. ఆ అనుభూతి నా కెందుకో కలుగుతోంది.

అయినా ఇంతవేగం చచ్చిపోను- మరో రెండేళ్ళయినా బ్రతుకుతానని డాక్టరుగారు ఆశకల్పించేటట్టు మాటాడుతున్నాడు. పెద్దాడితో ఈ అర్థం వచ్చేటట్టు ఆయన అంటూవుండడం నాచెవినపడింది.

కాళ్లు పొంగుచూపినా ఫర్వాలేదట.

కాని ఎవరు చెప్పగలరు ! వానరాకట లాంటిదే ప్రాణం పోకట ...క్షణం మనది కాదు - ఈ మాట జ్ఞానంరాని వయసునుంచీ వింటున్నదే.

—ఇంటా వంటా లేని - వ్యాపారం చేపట్టాను. బ్రాహ్మడికి వ్యాపారం ఏమిటన్నారందరూ.

ఎంతలాభం వచ్చినా మర్నాడేమవుతుందోనన్న భయంతో ఊపిరి బిగించి ఉగ్గబట్టుకోడంవల్ల రక్తపుపోటు తెచ్చుకున్నాను.

—ఈ ముసలాడి గోడు ఎవడు వింటాడు! వినాలని ఎవరి కుంటుంది? ఇదో సొద— దీనికి అంతుండదని మీరందరూ విసుక్కుంటూ ఉంటారు.

ఎన్ని కష్టాలు పడ్డానా! మూర్ఖులారా! నా బాధ మీకెలా తెలుస్తుంది! నేనేం చెప్పినా, చెప్పగలిగినా మీరెలా అర్థం చేసుకో గలరు!

పిల్లలు తల్లిదండ్రులకు — ముసలై మంచంపట్టిన వాళ్ళకు — ఋణపడి ఉండాలా?— 'వాళ్ళకి వీళ్ళేంచేసేరని! వాళ్ళనడిగి—వాళ్ళ కోసం కన్నారా?'— ఈ ధోరణి పదహారేళ్ళ వయసు తరవాతే ఎందుకు వస్తుంది?

—వెధవ, ముసలాడు — చావాచావడు — చాపా ఇవ్వడు — అని మీచేత విసుళ్లూ—కసుళ్లూ తింటూ-శరీరంలో వింత బాధలతో ఎలారా పడడం?

చచ్చేవాడినేరో! నాకూ చావాలనే ఉంది. కాని ఆ ఘడియ రావాలి కదా, నేనేం చెయ్యను చెప్పండి!

పిల్లలుకారు మీరు రాక్షసులైపోయారు. కొంచెమయినా మమతా' మానవత్వం లేకుండా ఇలా తయారయ్యారేమిటా అనే నా ఆవేదన.

—నాకేం, ఇద్దరు కొడుకుల చేతిమీదుగా పోతున్నాననే తృప్తి లేద్రా — అది నా ఖర్మేమో!

ఏ జన్మలో ఏ పాపం చేశానో! ఈ జన్మలో చేసినవి మీ కోసమేరా! కనుక్కున్నవాళ్ళే నన్ను నీచంగా చూస్తున్నారు. పువ్వోపువ్వోమని పెంచుకున్న పిల్లల ఆప్యాయతకి నోచుకోలేక పోయాను. నేనేం తప్పు చేశానని?

—కాస్త డబ్బుదగ్గర కాఠిన్యం వహించాను. డబ్బు సంగతే అంత. మరికొంచెం పిడికిలి వదులుచేస్తే పిల్లలకి చిప్పే మిగులుతుందని ఆరాటపడి చచ్చాను.

అన్ని పరిస్థితులలోకీ మహా నికృష్టమైంది దారిద్ర్యం. అదంటే నాకు భయం.

అందుకేకదా పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చిన లలితకి దూరమై— నీచమైన ద్రోహంచేసి— మనసులోనే కాకుండా, గుండెలో ఓ ముక్కని గునపంతో పెళ్లగించి-నరసమ్మని పత్నిగా స్వీకరించాను!

పిల్లకాకులకేం తెలుస్తాయిరా ఉండేళ్ల దెబ్బలు!

ఇక నా వీలునామా...

నా బాధ తదనంతరం... నా సపర్యలు చెయ్యనవసరంలేని కట్టెముందు—తృప్తిగా ఊపిరి పీల్చుకునేముందు—నా రక్తం పంచుకుని పుట్టిన నా బిడ్డలు—ఈ నా మాటలు సాంతం వినాలి—వినితీరాలి.

మీ అమ్మ మీ నాన్నలాంటిది కాదు. మహా ఇల్లాలు. నామాట కెప్పుడూ ఎదురు చెప్పలేదు. పుణ్యాత్మురాలు—కాబట్టే నాకంటే ఐదేళ్ల ముందే ఈడుపోతలుపడకుండా నాలా తిట్టించుకోకుండా కన్ను మూసింది.

దానికి జరిగినట్టు నాకు ఏనాడూ జరగలేద్రా.

డబ్బు సంపాదించేరోజుల్లో అదొక్కటే నా యావ. అది పడి పోయిన తరువాత ఉన్నదాన్ని భద్రపరచుకోవాలన్న తాపత్రయం.

డబ్బు సంపాదించడంకంటె కష్టంరా దాన్ని భద్రపరచుకోడం! ఎలా సంపాదిస్తున్నామన్నది కాదురా ప్రశ్న. ఎలా ఖర్చు పెడుతున్నా మన్న ఆలోచన ఉండాలి. అది ఒంటికీ, ఇంటికీ మంచిది.

నరసమ్మ పోవడంతో నా రక్తపుపోటుతోపాటు నా పాట్లు పెరిగి ఎగసి పడడం ప్రారంభించాయి.

ముసలి వెధవ కన్నుమూసేముందు—ఎప్పుడు ఈ గది ఖాళీ అవుతుందా అని పిల్లలు ఎదురు చూస్తున్న తరుణంలో రాయాల్సిన వీలునామా నాకు మరో వీలు కలుగచేస్తోంది.

నా మనసులో మాట—నా మనసులో బాధ వాళ్ళ గుండెల్లోకి జొరబడాలి.

—మమత పెంచుకున్నందుకా నాకీ శిక్ష?

ఏది పిసినారి తనం? ఏది జాగ్రత్త? వీటిమధ్య గీత ఎంతటిది? కట్టుకున్న దానికి తెలుసురా నాది పిసినారితనం కాదని— కట్టుకోకుండా వదిలేసిన దానికీ తెలుసురా నా మనసు!

పిల్లవెధవలందరినీ చదివించానా, దానికెంత ఖర్చయింది? ఆ డబ్బు నేను జాగ్రత్తగా ఉండకపోతే కూడపెట్టడం సాధ్యమయ్యేదా?

నా చిన్నతనంలో నేనెంత బీదరికం అనుభవించానో మీకెలా తెలుస్తుంది! ఆ సత్తె కాలపు రోజుల్లో పెద్దాడికి నెలనెలా రెండేసివందలు పంపుతూ ఉండేవాడిని. నేనగా ఎంత? నా వ్యాపారమనగా ఎంత? ఇంతకీ ఆ రోజుల్లో!

అది వాడికేమయినా తెలుసా?

బీద ఇంటి పిల్లయినా — నేను డబ్బువాపి మనిషినే అయినా— వాడు ప్రేమించాడని—ప్రేమంటే గుండెలో ఎలా తొలిచేస్తుందో తెలుసు కాబట్టి ఆ పెళ్ళికి ఒప్పుకున్నా.

నరసమ్మ నా స్వభావం తెలిసి వాళ్ళవాళ్ళని అవీ ఇవీ పెట్ట మంటే మాత్రం- డాక్టరు చదువుకున్న పిల్ల—తనుపడుతున్న కోడండ్రి కానికి బాధ్యత అంతటినీ నా మీదకే నెట్టాలా?

—తన తండ్రినయితే డాక్టరమ్మ అలాగే చూస్తుందా?

పోనీ కోడలయితే పై ఇంటినుంచి వచ్చినపిల్ల— మరి కొడుకో-కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది—అలాగని ఊరుకోలేంకదా!

ఈ ఆస్తి నా స్వార్జితం... ఈ మేడ...

నేను బొక్కికొంపకొని పదేళ్ల తరువాత— పాతకాలం రోజుల్లో ఇటిక ఇటికకీ డబ్బు కూడచేసి సిమ్మెంటుబస్తా ఐదు రూపాయల రోజుల్లో అణా అణా పోగుచేసి కట్టించుకున్న మేడరా ఇది!

కొడుకూ, కోడలూ, ఇద్దరూ డాక్టర్లు నీకేం మహరాజువి అంటారు నాకు తెలిసినవాళ్ళు. వాళ్ళతో చెప్పుకోను!

శెలవుపెట్టి ఏ ఒక్కరూ నాదగ్గర పట్టుమని పదిరోజులుండరు. అదరాబాదరా రావడం ఇంకాచావడని వెళ్ళిపోవడం. నాబాధ మామూలే.

పోనీ కూతురు ఉందంటే— ఏటేటా కాన్పులు నత్తానావా పిల్లలు- నేనెలావస్తానంటుంది.

'ఆయనకు శెలవులేదు. మరో పదివేలుంటే కారుమారుస్తానంటు న్నారు... ఒడ్డికేలెండి.' అంటుంది నాకూతురు.

కూతురి కాఠిన్యం కొడుకుల కాఠిన్యంకంటె బాధకలిగిస్తుంది.

ఆచిన్న వెధవ చిన్ననాటినుంచి ఆకతాయివెధవే. వాళ్ళమ్మయితే ఎలాగో వాడిని బుజ్జగించి మెల్లగా బి.కాం. చేయించింది.

ప్రేమించేస్తే గొడవని నాస్నేహితుడి కూతురినిచ్చి ముందే పెళ్లిచేసేశాను. వాడిగోలవాడిది. వాడూ-వాడిపెళ్ళాం... మేనమామల పోలికవెధవకి.

వెధవాయిలు తల్లిమంచాన బడితే బిలబిలావచ్చేశారు. ఊరట కబుర్లు చెప్పారు. కాలూ, చెయ్యీ రాశారు.

మరి నేనేం పాపంచేశాను?

నిన్న డాక్టరుమొహం అదోలా పెట్టాడు. నేను బ్రతికివుండటం చూసి ఆశ్చర్యపోయినట్టున్నాడు. ఈ కుర్రకారుల్ని ఇంతప్పటినుంచీ చూసి వాళ్ళబుర్రల్లోని ఆలోచనలను తెలుగు లిపిలా చదివేస్తాను- పిల్ల కాకులు వాళ్ళకేం తెలుసు!

రోగం తీసుకుపోయేదే అయినా ఎందుకోగట్టిగా మొరాయిస్తోంది ప్రాణం వెళ్ళనని.

నా ఆవేశం... నా అక్కసు తీర్చుకోవాలి. ఈ వెధవలకి సరి యైన శాస్తిచేసే చావాలి...

లేచికూచోలేను. రాయకుండా ఉండలేను. కొద్దికొద్దిగా రాస్తూ ఆపుతూ మెల్లమెల్లగా నా ఆలోచనలని అక్షరాల్లో పొందుపరుస్తున్నాను.

ఇక్కడ ఎవరూలేరు. అసలు ఎవరుంటున్నారు. ఆ లచ్చిమి గోడకు జేరగిలబడి నిద్దరోతోంది. పాపం చిన్నముండ! దానిఋణం ఎలాతీర్చుకుంటారో వెధవల్లారా!

మమతకి రక్తసంబంధం అక్కరలేదు. మనిషిలో వుండాల్సిన మనసుంటేచాలు.

వారంరోజులై రాస్తున్నా, వీలునామా తెగిచావడంలేదు. ఎవరికి రాయాలీ ఈ ఆస్తి?

నా ఆస్తికివారసత్వపు హక్కు నా కడుపున పుట్టిన పిల్లలకి లేదు. వాళ్ళు ప్రాజ్ఞులుకారు- డిగ్రీలున్నాయంతే... ఇది నా స్వార్జితం ఈ ఆస్తి నేను ఎవరికి రాసినా అది నా పిల్లలకళ్ళు తెరిపించేటట్టుగా వుండాలి.

ఇది నాపూర్తి స్వస్థతతో, నాపూర్తి మనసుతో, చిత్తశుద్ధితో దీర్ఘంగా ఆలోచించిన తరువాత నా స్వదస్తూరీతో రాస్తున్న వీలునామా!

పాపం లచ్చిమి! మారు మనువాడడానికి డబ్బు నేనిస్తానన్నాను.

లలితకోసం ఎప్పుడో ఓక్షణం ఆవేశంలో చేయించిన గాజులు నరసమ్మతో-ఎవరివోప ద్దువని చెప్పినవీ ఓ గొలుసూ లచ్చిమికివ్వాలి.

మనుషుల పుట్టుకతో జాతినిర్ణయింపబడడం కేవలం అసందర్భం మనుషులు మనుషులా రాక్షసులా అన్నది వాళ్ళఆలోచనలమీదా,వాళ్ళు చూపించగలిగే జాతిమీదా ఆధారపడి ఉండాలి.

లలిత విసుక్కుంది. అందంగా కోపగించుకుంది.

"ఛీఛీ! ఇవేంపనులు!" దొరికినచోటేదొరికి పారిపోయింది.

"నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను" అన్నా... లైంగికాను భవంలో అనుభూతిలో మగాడికి స్వార్థమేఎక్కువ! ఆడదానికి అంత స్వార్థముండదేమో!

నాన్నపోయాక వాళ్ళనాన్న నాతోనే సంప్రదించాడు.

నాకుడబ్బు కావాల్సివచ్చింది.

లలిత మాఅమ్మ కొంగుపట్టుకు తిరుగుతూవుండేది. "అత్తయ్యా"! అంటూ మురిపాలు పోయేది.

నానుంచి ఏం ఎదురుచూసిందో! ఏకాంతంలో ఎన్నిసన్ని వేళాలు!

'మురళీ, నాన్ననాకు పెళ్ళిసంబంధాలు చూస్తున్నారు!' అంది గడుసుఘటం.

దానిపిలుపులో ఎంతమార్దవం...ఎంత ఆర్ద్రిత...ఎంతవలపు- ఎంత మమత!

నేను పన్నెండువేలు కట్నంతీసుకుని నరసమ్మమెడలో పుస్తె ముడివేశాను. నా బ్రతుకు కుదటపడడంకోసం చేశానని, కుటుంబంకోసం నేనో త్యాగంచేశాననీ నన్నునేను సమాధాన పరచుకున్నాను... కాని కొడుకుల నెత్తుకున్న నా కొడుకులు ఎప్పుడయినా నన్ను మనిషిగా చూశారా? నాకూతురు నన్ను 'నాన్నా!' అనిపిలిచి డబ్బుఅడగకుండా ఎప్పుడుంది కనుక! ఇక మనవలా, నా గదిలోకివస్తే నాజబ్బు అంటు కుంటుందని నమ్ముతారు! పెద్దవాళ్ళన్నమాటలే. పాపం వాళ్ళకేం తెలుస్తుంది. నా గదిలో కంపట!

ముసలాడి శరీరంలోనుంచి సుగంధం ఎలావస్తుంద్రా! మీరు అసహ్యంచుకున్నా మీకూ ఓనాడు ఇది తప్పదని తెలుసుకోరేం?

నాతదనంతరం నా స్వార్జితమైన ఈమేడా, బ్యాంకుల్లో నాపేర వున్నడబ్బు- నాభార్య నగలూ...

పాపం లలిత! కట్నాలిచ్చుకోలేక పట్టుబ్రర బ్రాహ్మడికి కట్టే శారు. వరసగా ముగ్గురు పిల్లల్నికంది. లారీయాక్సిడెంటులో డ్రైవరు తుక్కయిపోయాడు. లలిత వితంతువై పోయింది.

నా ఆస్తి అంతటినీ నాతదనంతరం లలితకి సంక్రమించేటట్టు రాసేస్తే?

నా తదనంతరం-

లలితకి డబ్బుఎలా ఖర్చుచెయ్యాడమో తెలీదు. పిల్లలు లారీలు తోలుతూనో, కడుగుతూనో, బ్రతుకుతున్నారు... బంగారంబొమ్మ లాంటి లలితగుండూ, అడ్డకట్టూ చూడటానికి వీల్లేకుండా తయారై పోయింది. దీనిదుంపతెగ సరిగా తిండయినాలేకుండా ఏడేటాపిల్లలట... అదేం మనుషులమో అదేం యావో!

దానికెందుకు డబ్బు! నేను లలితపేర ఆస్తి రాసేస్తే నాకూ లలితకీ అక్రమ సంబంధం ఉందని అనేసినా అనేస్తారు పిల్లవెధవలు.

—లచ్చిమికీ నాకూ రంకే కట్టేసింది పెద్దకోడలు! ఏమి చదువులో ఏమో! డాక్టరు బ్రర— దానినిండా కుళ్ళే ఉండాలా?

ఆ పెద్దకొడుకూ, కోడలూ డాక్టర్లు కాకపోయి ఉంటే లచ్చిమి వయసు మనవరాలే ఉండేదినాకు. గుంటపూలు పూస్తున్నారు. ముప్పై ఐదోఏట మొదట కానుపా?

లలితకి ఆస్తిఇచ్చి ప్రయోజనం లేదు... ఆ నగలు చేయించాను, ఇవ్వగలిగానా? కనీసం ఎదుటపడి మాట్లాడగలిగానా?

అదిరా జీవితంలోని ఆంతర్యం! తమాషా!

—అనాధశరణాలయంలోని పిల్లలకి తల్లితండ్రుల ఆలనా పాలనా ఉండదు. వాళ్ళకి కొంచెం సుఖం ఏర్పాటు చేసిన వాడినవు తానేమే! నా పేరు చెప్పుకుంటారు కుర్ర నాగమ్మలు....

ఈ వీలునామా సొంతం చదివాక సువర్ణ కళ్లు ఎలాపెడుతుందో నేను ఒక్కక్షణం చూడగలిగితే ఎంత బాగుణ్ణు!

—కొన్ని కోరికలే వికృతంగా ఉంటాయి. అనాధశరణాలయాల్లో ఉండే ఓ అబ్బకీ అమ్మకీ పుట్టనివాళ్ళకోసమా ఇన్నాళ్ళ—ఇన్నేళ్ళ కష్టపడి ఈ ఆస్తి పోగుచేశాను! డబ్బు కోసమని నా పిల్లలకే నేను దూరమైపోయానే!

ఆస్తి ఎవరికో రాసేసి చచ్చికూడా శాపనార్థాలు తినేదా?

—పాపం! లచ్చిమి కష్టపడి పనిచేస్తూవచ్చింది. మారుమనువు కెళ్ళకుండా, నీతిగా ఉంటోంది. దానికి రాసిచ్చేస్తే!

దాన్నిచూస్తే ఎందుకో చంటిది గుర్తొస్తోంది. బ్రతికిఉంటే చంటిదానికి దీని వయసే ఉండేది. ఎప్పుడూ నా దగ్గరే పడుకునేది...

—ఇక పెద్దది... దాని మొగుడు తెమ్మంటే అడగక ఏం చేస్తుంది? ఆడదానికి మొగుడంటే ఎందుకుచెప్మా అంత అభిమానం! ఇక చిన్నాడు... నేనువాడిని విచ్చలవిడిగా ఖర్చు చెయ్యనివ్వనని వాళ్లావిడదగ్గర వాడికి నామోషీ! ఇక పెద్దాడా...డాక్టరుమరి. రెండు చేతులా సంపాదన! నేను ఎలాగూ బ్రతకనని తెలుసు. నా దగ్గర కూర్చుంటే ఏం లాభం? నా పోలికేవాడికి! ఏది ముఖ్యమో అదే— అంతే! పిల్లలు కాన్వెంటు చదువులు... ఓ పూట పాఠం పోతే ర్యాంకు పోయే ప్రమాదం ఉందట. వాళ్ళగొడవలు వాళ్ళవి.

—నా పిల్లలూ—వాళ్ల పిల్లలూ, వాళ్లవాళ్ల పిల్లలూ మమత మరిచిపోకుండా ఉండాలనే నా దీవెన.

—ఇందుమూలంగా ఖరారుగా తెలియచేయడమేమనగా — నా తదనంతరం నా ఆస్తి— నా పిత్రార్జితమైతే ఏ విధంగా నా పిల్లలకు చెందుతుందో—అదే విధంగా — ఈ ఆస్తిఅంతా నా పిల్లలకే చెందాలి. ఆస్తి పంపకాలు వాళ్లలోవాళ్లే చేసుకోవాలి. ఆస్తి పంపకాల మరుక్షణం — నా అనుభవాల ఈ చివరిచిట్టా నా కట్టెలాగే నిప్పులలో వెయ్యాలనీ ఇందు మూలంగా నా చివర కోరికగా చెబుతున్నాను."

—వకీలుగారు కాగితాలు మడిచి "ఇక మీ ఇష్టం!" అని పెద్దబ్బాయి చేతిలో ఉంచారు.

"అన్నట్టు మరిచిపోయాను...లచ్చిమికి ఇమ్మని నా చేతికి కొంత డబ్బూ, బంగారం ఇచ్చారు. ఆ సీలుచేసిన కవరు మీ సమక్షంలో ఆమెకిస్తాను. ఆమెకు కబురు చెయ్యండి!"

మురళీధరరావ్‌గారు పిల్లలు ఒకరి ముఖాలు ఒకరు చూసు కుంటూ అలా ఉండిపోయారు.